క్లుప్తంగా

అక్టోబర్ 2న మాంసం విక్రయించొద్దు

దేవరకొండ : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయాలు జరుపొద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాంసం విక్రయ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పనిసరిగా ప్రతి ఒక్క మాంసం విక్రయ వ్యాపారి మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. అదే విధంగా వ్యాపారులు విధిగా లైసెన్సులు పొందాలని, క్రయ విక్రయాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సమావేశంలో పర్యావరణ ఇంజనీరు సక్కునాయక్, తదితరులున్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : దేశ భక్తిని పెంపొందించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ మంత్రి ప్రగడ శ్రీధర్‌జీ అన్నారు. సోమవారం విజయదశమి సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాలను దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలను పట్టణంలోని 12 బస్తీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ గవ్వల నరేష్ సంఘ్, జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ చెరుపల్లి కరుణాకర్, గాయం నరేందర్‌రెడ్డి, యామిని వెంకటేశ్వర్లు, పాల్వాయి నరేష్, వనపర్తి శ్రీనివాస్, కనపర్తి సత్యప్రసాద్, సుధాకర్, శ్రీనివాసాచారి, రామకృష్ణ తదితరులున్నారు.

చీటింగ్ కేసులో ఇరువురికి రిమాండ్

నాగార్జునసాగర్: చీటింగ్ కేసులో అరెస్ట్ అయి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న ఇరువురిని నాగార్జునసాగర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారిని అక్టోబర్ 2వ వరకు రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేరంగుల రాజేష్, దేరంగుల లక్ష్మి వీరిరువురు భార్యభర్తలు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుకొండ పట్టణ వాసులు. 2022లో జరిగిన కేసులో అరెస్టయ్యారు. కేసు కోర్టులో ఉంది.కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకోని తిరుగుతున్నారు. నిడమనూరు కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో వారిని పిడుగురాళ్ల అనుపాలెం దగ్గర అరెస్ట్ చేసి విధించి నల్లగొండ జైలుకు పంపినట్లు సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

సీఐటీయూ నేత మందరాజుకు సన్మానం

మిర్యాలగూడ అర్బన్ : భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా సహాయ కార్యదిర్శగా ఎన్నికైన పెయింటింగ్ కార్మికుడు మంద రాజును సోమవారం బిల్డింగ్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, సంఘం బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కంచి కేశవులు, పాశం గోవర్ధన్‌రెడ్డి, బుజ్జిబాబు, గౌస్, ప్రసాద్, క్రాంతి, సురేందర్, పల్లె వెంకన్న, బాబు, మంగమ్మ, రమేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.

కాటి వీరయ్య మృతి బాధాకరం



వీరయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణుధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని ఫకీర్‌పురం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త కాటి వీరయ్య మృతి బాధాకరమని టీపీసీసీ సభ్యుడు, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వీరయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో జగదీష్, కస్తూరి సత్తయ్య, రావుల వెంకన్న, వెంకటయ్య, బ్రహ్మయ్య, వెంకటేష్, వెంకన్న, సిహెచ్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో వైద్య శిబిరం



వైద్యశిబిరానికి తరలివచ్చిన రోగులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 111 మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సయ్యద్ అజహార్ అహ్మద్, రామాంజనేయులుతో పాటు పలువురు వైద్య సిబ్బంది తదితరులున్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మిర్యాలగూడ : యాద్గార్‌పల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న భవాని మాలధారులు



హాలియా : బాలా త్రిపురసుందరి దేవిగా అమ్మవారు



దేవరకొండం : కన్యకాపరమేశ్వరి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



మిర్యాలగూడ టౌన్ : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నిడమనూరులో..



పెద్దవూర : పూజలు చేస్తున్న భక్తులు



డిండి: సింగరాజుపల్లిలో..

పోరాటాలతోనే సమాజంలో మార్పు



రంగయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : పోరాటాలతోనే సమాజంలో మార్పు జరుగుతుందని, ఆ పోరాటాలు సాగించే కమ్యూనిస్టు పార్టీలకే భవిష్యత్ ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కన్నెకంటి రంగయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొని రంగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రంగయ్య చేసిన పోరాటాలు, త్యాగాలను నేటి కార్యకర్తలు గుర్తు చేసుకొని భవిష్యత్ ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. పేదరికంలో పుట్టినప్పటికీ చిన్ననాటి నుంచి చనిపోయేంతవరకు ఎర్రజెండా నీడలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్‌మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, చౌగాని సీతారాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరశురాములు, అయూబ్, వాడపల్లి రమేష్, గోవర్ధన, అరుణ, కన్నెకంటి రామకృష్ణ, వస్కుల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయరూ..



అధ్వానంగా ఉన్న పోరెడ్డిగూడెం - పాములపాడు రహదారి

మాడుగులపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పోరెడ్డిగూడెం- పాములపాడు రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డు సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్తుండడంతో నిత్యం అనేక వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్తుంటాయి. అధ్వానంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, పలువురు కిందపడి గాయాలపాలవుతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూస్తాం



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ మున్సిపల్‌కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. రెండు రోజుల పాటు కురిసిన లోతట్టు ప్రాంతాల పరిశీలన భారీ వర్షానికి పట్టణంలోని 11, 18వ వార్డుల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం స్థానికులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ నీటిని తొలగించేందుకు సాధారణ పనులను పునరుద్ధరించాలని, అందుకు మున్సిపల్ సిబ్బంది తక్షణ చర్యలను చేపట్టాలన్నారు. అవసరమైతే అదనపు డీ వాటరింగ్ పరికరాలను వినియోగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే సమయంలో ఆరోగ్య, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ప్రాంతాల్లో బ్లీచింగ్, డిస్పెక్షన్ పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో నీరు నిల్వ సమస్యలు మళ్లీ తలెత్తకుండా మున్సిపాలిటీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, రవితేజ, పీ నవీన్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది,, అధికారులు తదితరులున్నారు.

యాద్గార్‌పల్లి చెరువులో చెత్తచెదారం తొలగింపు

జాతీయ స్థాయి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని చైతన్యనగర్ యాద్గార్‌పల్లి చెరువు(బోటింగ్ పార్క్) వద్ద మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ జలాశయాల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత కాపాడటం, ప్రజల్లో శుభ్రత, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు వెంకటరమణ, రవితేజ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డిలతో పాటు జవాన్లు తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి



మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి



చందంపేట : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ చంద్రకళ

మిర్యాలగూడ టౌన్ : ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమణి సూచించారు. సోమవారం పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల తల్లిదండ్రులకు 'సంరక్షులతో పోషకాహారం' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అదే విధంగా చిన్నారులు చేసిన యాక్టివిటీస్‌లను తల్లిదండ్రుల వద్ద ప్రదర్శించారు. అదే విధంగా చిరు ధాన్యాలను ప్రదర్శించి పౌష్టికాహారం ప్రముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బి. నాగమణి, శ్రీపాద అంజలిదేవి, రెహానా, ఆయాలు సైదమ్మ, శిరసనగండ్ల హైమావతి, నాగలక్ష్మిలతో పాటు బాలికలు ఉన్నారు.

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చంద్రకళ పోషకాహార ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆహారం తినేటప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, రమాదేవి, నారాయణమ్మ, మణెమ్మ , కోలకోండ రేణుక, ఆయాలు కలకొండ చంద్రకళ, గిరిజ తదితరులున్నారు.

రియల్టర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కృష్ణ

త్రిపురారం : తెలంగాణ రియల్టర్ అసోసియేషన్ త్రిపురారం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన భైరం కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భైరం కృష్ణకు నియామకపత్రం అందజేశారు. గౌరవ సలహదారుడికి అనుముల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దోరెపల్లి రాములు, కనగంటి ఉపేందర్, కందిమళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా మేదరి సైదులు, పామోజు వెంకటాచారి, కార్యదర్శిగా చింతకాయల యాదయ్య, పడిశల జానయ్య, కోశాధికారిగా జంగిలి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దోరెపల్లి కొండల్, మడుపు అభిరామ్, కార్యవర్గ సభ్యులుగా ఇరుగు దుర్గయ్య ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు రియాల్టర్‌ల సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.



భైరం కృష్ణను సన్మానిస్తున్న సభ్యులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మిర్యాలగూడ : బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



నిడమనూరు : చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం

మిర్యాలగూడ : ఆపదలో ఉన్న పేదలు ప్రభుత్వం అందించే సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల ఆయన నివాసంలో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పది మంది లబ్ధిదారులకు రూ.7లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేదలు వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అందించే సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలి కాంతారెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, సత్తిరెడ్డి, పుల్లయ్య, వెంకట్‌రెడ్డి, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బాలు, వినోద్, కోట సైదులు, నెహ్రూనాయక్, హరీష్, హనుమయ్య పాల్గొన్నారు.

నిడమనూరు : మండలంలోని 12 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4లక్షల 10 వేల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆదేశాలతో మార్కెట్‌కమిటీ చైర్మన్ సత్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మెరుగు శ్రీనివాస్, పోలె రవి, చెర్క శ్రీను, మోసాల శ్రీను, పోలెపల్లి ఇసాక్, చంద్రశేఖర్, జానీబాషా, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

రాకపోకలు బంద్

నిడమనూరు : మండలంలోని ఊట్కూరు చెరువు అలుగుపోస్తే ఉట్కూరు-నందికొండవారిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఊట్కూరు గ్రామ శివారున వాగుపై ఊట్కూరు-నందికొండవారిగూడెం గ్రామాల మధ్య రూ.3.25 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి.. చెరువు అలుగు, వర్షపు నీటి ప్రవాహం, ఎస్సెల్బీసీ హై లెవల్ కెనాల్ నీటితో ఊట్కూరు వాగు నీటి ప్రవాహం అధికంగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణం వద్ద డైవర్షన్ రోడ్డులో వేసిన తాత్కాలిక బ్రిడ్జి ఆ వరద నీటి ప్రవాహనికి కొట్టుకపోతుంది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి.



ఉధృతంగా ప్రవాహిస్తున్న ఊట్కూరు వాగు

కొనసాగుతున్న యూరియా బారులు



నిడమనూరు : మార్కెట్ వద్ద యూరియా కూపన్లు, రశీదులకోసం బారులుదీరిన రైతులు



త్రిపురారం : రైతు వేదిక వద్ద యూరియా కోసం చెప్పలను క్యూలో ఉంచిన రైతులు

నిడమనూరు : నిడమనూరులో యూరియా కోసం రైతుల బారులు కొనసాగుతున్నాయి. సోమవారం 30టన్నుల యూరియా మండల కేంద్రానికి వచ్చింది. దీంతో రైతులు నిడమనూరు మార్కెట్ వద్ద గల వ్యవసాయ కార్యాలయంలో క్యూలైనులో మూడు, నాలుగు గంటలకు పైగా నిలబడి, కూపను పొంది, సహకార సంఘం గోదాం వద్ద యూరియా తీసుకున్నారు. దగ్గర రశీదు, వ్యవసాయాధికారుల ధ్రువీకరణతో రైతులు అందరూ ఒకే దగ్గర ఉండి ఆగ్రహంతో ధర్నాకు దిగుతున్నారని పోలీసులు పక్కా వ్యూహంతో మార్కెట్‌లోని వ్యవసాయా కార్యాలయం వద్ద అధికారుల ధ్రువీకరణ, నగదు చెల్లింపు రశీదు పొందిన అనంతరం సహకార సంఘం గోదాం వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారు. దీంతో రెండు చోట్ల రైతులు బారులుదీరుతున్నారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. సోమవారం యూరియా కోసం మండల వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులు ఉదయం 5గంటల నుంచి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద చెప్పులు వరుసలో ఉంచి వేచి చూశారు. అనంతరం అధికారులు వచ్చి ఈ రోజు యూరియా పంపిణీ లేదని చెప్పడంతో నిరాశగా ఇంటికి వెళ్లారు. కొంత మంది రైతులు సాయంత్రం వరకు వేచి చూశారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండలు

మిర్యాలగూడ : పట్టణంలోని తాళ్లగడ్డలోని సర్వే నంబర్ 60, 61లో గల 3.04గుంటల ప్రభుత్వ సీలింగ్ భూమి(మల్లెపూల తోట), సర్వే నంబర్ 118, 519లోని చెరువు శిఖం భూమిలో, ఇందిరమ్మ కాలనీలో కేటాయించిన పార్క్ ఏరియాలో వాటర్ ట్యాంక్ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త చిలుము కొండలు సోమవారం నల్లగొండలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను స్వాదీనం చేసుకోని అక్రమ కట్టడాలను తొలగించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైన అధికారులు దృష్టిసారించి ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి స్వాదీనం చేసుకోని వారి బారిన పడి నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం అందించి భూములను పరిరక్షించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి మాట్లాడారు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. ఎదగనిద్దాం అనే నినాదంతో విద్యార్థి సంఘాలు బతుకమ్మను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు అరుణ, పాదూరి గోవర్ధన, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర రమిటీ సభ్యుడు శ్రీను, జిల్లా నాయకులు జగన్, వీరన్న, ప్రసన్న, సూర్యా నాయక్, ఊర్మిళ, నిర్మల, రోషమ్మ, జ్యోతి, అఖిల్, బన్ని, ప్రవీణ్, శంకర్ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



రామ్మూర్తి కాలనీలో..



జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై వరుసగా ఉన్న విద్యుత్ స్తంభాలను అల్లుకున్న తీగ



పెద్దవూర సబ్‌స్టేషన్ ఎదుట



కంపచెట్లతో కనిపించని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దవూర : అధికారుల నిర్లక్ష్యం, పాలకుల బాధ్యతారాహిత్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఫోటోలలో కనిపిస్తున్న ఫోటోలే దీనికి నిదర్శనం. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోనూ, సమీపంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలను తీగజాతి ఆకులు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట నీమానాయక్ తండా, రామ్మూర్తి కాలనీ గ్రామాలలోనూ విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రహదారుల వెంట వెళ్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. మండలంలోని కుంకుడుచెట్టుతండా గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగజాతి ఆకులు కమ్మేశాయి. దీంతో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్లు ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజ్ కొట్టేసినప్పుడు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కరెంట్‌ను ఆఫ్ చేయాలన్న ఇబ్బందిగా మారింది. విద్యుత్ స్తంభాల వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తీగజాతి ఆకులు అల్లుకోవడం వల్ల వర్షాలు వచ్చినప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన రహదారుల వెంటనే ఇలా ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలాం ఉంటుందో అధికారులు తెలియాలి. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తీగజాతి ఆకులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.